
# గ్రహణం పట్టిన జాబిల్లి



ఆదివారం సాయంత్రం—

అయిదుగంటలు దాటి కొన్ని నిముషాలైంది.

అసహనంగా కదిరింది జాబిల్లి. అప్పటికి ఆమె రోడ్డుమీదకొచ్చి నిలబడి పది నిముషాలు కావస్తోంది.

విసుగ్గా రోడ్డుకేసి దృష్టిని సారించింది. అతని జాడలేదు.

చిరాగ్గా చేతి వాచీకేసి చూసుకొంది జాబిల్లి.

అయిదుగంటల అయిదు నిముషాలు!

సరిగ్గా అదే సమయంలో ఓ సుజుకీ మోటర్ సైకిల్ ఆమె ముందాగింది. దానిపైన నవ్వుతూ నిరంజన్.

ఒక్క గెంతులో మోటర్ బైక్ మీదికి దూకింది జాబిల్లి. ఆమె ఎంత విసురుగా బైక్ ఎక్కి కూర్చుందీ అంటే నిరంజన్ బైక్‌తో సహా కింద పడబోయి నిలదొక్కుకున్నాడు.

'పద, ఇంకా చూస్తావేం' దాదాపు అరిచినట్టుగా అంది నిరంజన్ చెవిలో.

ఒక్క కిక్‌తో స్టార్టయిన బైక్ బుల్లెట్‌లా ముందుకి దూసుకుపోయింది. జాబిల్లి చెయ్యి తన నడుంచుట్టూ పడకపోవడాన్ని గమనించాడు నిరంజన్.

'ఇంత లేటయిందేం? నీకోసం రోడ్డుమీద అయిదు నిముషాల నుంచీ ఎదురుచూస్తున్నాను తెలుసా?'

అంతవరకూ ఉన్న అసహనాన్ని అంతటినీ గొంతులో పలికించింది జాబిల్లి.

'తొందరపడకు సమాధానంచెప్పే వరకైనా కాస్త ఓపికపట్టు మైడియర్' అన్నాడు నిరంజన్.

'దానికి ఎంతసేపు పడుతుంది? ఎన్ని గంటలు కావాలి? లేక రోజులు కావాలా?' జాబిల్లి గొంతులో చిరాకుకలిసిన వెక్కిరింత కనబడింది నిరంజన్‌కి.

'ఇదే నీతో వచ్చిన చిక్కు. నీకు తొందరెక్కువ ఓపిక తక్కువ'

'మహానుభావా మొదలెట్టావా సుత్తి' తన సుడి భుజంతో నిరంజన్ వీపుని పొడుస్తూ అంది జాబిల్లి.

'సుత్తికాదు. నిజంగానే నీకు సహనం బొత్తిగా లేదు. నీతో వేగడం చాలా కష్టం.'

'వేగకపోతే మానెయ్. అయినా ఆ సంగతి ఇపుడే కనిపెట్టావా, ఇదుగో చెప్తున్నా నువ్వు సుత్తికొట్టకు నాకసలే చిరాగ్గా ఉంది ఇప్పటి వరకూ డాడీ కొట్టిన సుత్తికి...'

ఆనందరావు గారు ఎటువంటి మనిషో నిరంజన్‌కి బాగా తెలుసు. చాలా నెమ్మదస్తుడు. కష్టపడి జీవితంలో పైకొచ్చినవాడు. ఎంత ఓర్పూనేర్పూ లేకపోతే జాబిల్లి లాంటి తల్లిలేని

దమయంతీ చౌదరి

# రీడర్స్ మెయిల్

సరికొత్త గెటప్‌లో ముస్తాబయి ప్రతివారం మమ్మలరిస్తున్న ఉదయం వీక్లీలో మహిళలకోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక శీర్షిక 'జయకేతనం' శీర్షిక చాలా బాగుంది.

**ఎ.రమేష్, ఆర్.ప్రభాకర్, భూపాల్‌పల్లి**

ఈవారం 'ఉదయం' సూపర్బ్. ఉదయంలో శీర్షికలు ప్రయోజనకరంగా ఉన్నాయి. చందు సోంబాబుగారి 'బస్తీ దొరసాని' చాలా అద్భుతంగా ఉంది. సరికొత్త రూపంలో మమ్మల్ని మురిపిస్తున్న వీక్లీకి మా అభినందనలు. పాఠశాలలో, కళాశాలలో పాఠాల వేడిలో బుర్ర వేడెక్కే కుర్రకారుకి మీ పత్రిక ఒక 'బి' కాంప్లెక్స్.

**ఆర్.మురళి, హిందూపురం**

భాగ్యశ్రీ ముఖచిత్రంతో వచ్చిన ఉదయం నవతరం వారపత్రికలో ప్రారంభమైన 'శర్యచక్ర' సీరియల్ బాగుంది. అరణిగారికి మా అభినందనలు. టిప్పుసుల్తాన్ సీరియల్‌లో టిప్పుసుల్తాన్ గురించి ఎన్నో ఆసక్తికరమైన విషయాలు తెలుసుకుంటున్నాం. సీరియల్ అద్భుతంగా ఉంది.

**బానోతు జవహర్, ఏటూరునాగారం**

ఉదయం నవతరం వారపత్రికలో 'శ్రీ సాయిలీలలు' ఎంతో మనోహరంగా ఉంది. సీరియల్స్ అన్నీ బాగున్నాయి.

**ఎస్.శ్రీకృష్ణ, మునగాల**



ఉదయం నవతరం వారపత్రిక కొత్త గెటప్ చాలా బాగుంటోంది. సుదర్శన చక్రం, బస్తీదొరసాని సీరియల్స్ చాలా బాగున్నాయి. ఇంతమంచి సీరియల్స్ అందిస్తున్న మీకు మా ధన్యవాదాలు.

**సాయిబాబా, శారద, అమలాపురం**

ఈవారం ముఖచిత్రంలో 'భాగ్యశ్రీ' ముచ్చటగా ఉంది. అరణిగారి 'శర్యచక్ర' సీరియల్ బాగుంది. తొలివారంతోనే బాగా ఆకర్షించింది. ఈ వారం కథలు కూడా బాగున్నాయి.

**జి.ఆంజనేయులు, జి.అవినాష్, గరిడేపల్లి**

భాగ్యశ్రీ ముఖచిత్రంతో వెలువడిన ఈ వారం ఉదయం సంచిక హృద్యంగా ఉంది. కథలు, కార్టూన్లు బాగున్నాయి. మల్లాదిగారి సీరియల్‌కు మా హార్దిక స్వాగతం.

**బి.ఎస్.శ్రీనివాస్, వికారాబాద్**

చందు సోంబాబుగారి 'బస్తీ దొరసాని' చాలా బాగుంది. మమ్మల్ని బాగా ఆకట్టుకుంది. సీరియల్ విడవకుండా చదివిస్తోంది.

**కె.తిరుపతి, పెద్దశంకరంపేట**

ఈవారం మీరందించిన 'ముత్యాల సరాలు' ముచ్చటగా ఉండి, మా మనసుని దోచుకున్నాయి. అలా అనుకుంటే వీక్లీయే ఓ ముత్యాల సరంలా ఉంది. మీకు మా అభినందనలు.

**ఝాన్సాంబ, హిందూపురం**

---

కూతుర్ని పెంచుతూ వెగ్గుకొస్తున్నాడో అతని ఊహకి అందని విషయం కాదు.

'ఏం జరిగిది?' అడిగాడు నిరంజన్.

'ఏమీ జరగలేదు మామూలే. ఆడపిల్ల అణకువగా ఉండాలి. ఏ పనిచేసినా ఓర్పుగా బుద్ధిగా నిలకడగా చెయ్యాలి అంటూ మొదలెట్టి...'

'చింతబరికె పుచ్చుకున్నారా?' గట్టిగా నవ్వేస్తూ అన్నాడు నిరంజన్.

'అంతపని నన్నెవరైనా చేస్తే, ప్రాణం తీసెయ్యను' వెంటనే అనేసింది జాబిల్లి.

నిరంజన్ నవ్వు ఆపేశాడు.

'నిజం. నువ్వు అన్నంత పనీ చెయ్యగలవు'

'షటప్' అరిచింది జాబిల్లి.

'అయినా బుద్ధిలేనిది నిమకన్నవాళ్లకి గానీ నీకు కాదు...' అంటూ ఏదో చెప్పబోయిన నిరంజన్ నోరు చేత్తో మూసేసింది జాబిల్లి.

'అదుగో మళ్లీ ఆఖరి సారిగా చెప్తున్నాను నువ్వు గనక సుత్తి ఆపకపోతే...'

'ఏం చేస్తావ్?' కవ్వించాడు నిరంజన్.

'నిన్ను బైక్ మీదనుంచి కిందికి తోసేస్తాను జాగ్రత్త' బెదిరించింది.

'అమ్మయ్య అంతేకదా నువ్వే దూకేస్తావంటావేమోనని భయపడి చచ్చాను'

'నువ్వు జోక్స్ అనుకొంటున్న నీ వెధవ డైలాగ్‌ని చూస్తే ఒళ్లుమంట నాకు' చెప్పింది జాబిల్లి.

'నేనిప్పుడేమీ జోకు వెయ్యలేదే, ఇంతకీ అయిదు నిముషాలు నేను రావడం ఆలస్యం అయిందని మండిపడిన దానివి ఎందుకో కారణం అడగవేం?'

'అది చెప్పవేమిటా అనే చూస్తున్నాను, వేరే అడగాలా?' చిరాకుపడింది.

'అబిడ్స్ బుక్‌షాపులో ఓ మంచి పుస్తకం కనబడింది. బేక్ కవర్ మేటర్ చూడగానే నీకు పనికొస్తుందనిపించింది. వెంటనే కొనేశాను'

'గొప్ప పనిచేశావు' నిరాసక్తంగా అంది జాబిల్లి.

'అది ఏం పుస్తకమో అందులో ఏం రాసుందో తెలుసుకోవాలని లేదా నీకు?'

'ఇప్పుడు నా కలాంటిదేమో లేదు. నువ్వే చెప్పు అదికూడా'

'కలిసి బతకడం ఎలా?' అన్న ఇంగ్లీషు పుస్తకం అది. నువ్వు తప్పకుండా చదివి తీరాల్సింది. ఒకే రకం మనస్తత్వం గల నీలాంటి వాళ్లిద్దరు ఒకే రూంలో అస్తమానం దెబ్బలాడుకుంటూ కలిసి ఉంటూ ఉంటారు. సర్దుకుపోయి బతకడం ఎలాగో చెబుతాడు రైటర్ ఇందులో, ఇదుగో చూడు'

పెట్రోల్ టాంక్ మీదున్న ఓ చిన్న నార సంచీలోంచి పుస్తకం తీసి ఇస్తూ అన్నాడు నిరంజన్.

దాన్ని అందుకునే ప్రయత్నం చెయ్యలేదు జాబిల్లి. ఆమె మనసంతా గజిబిజిగా ఉంది. ఉక్రోషంగా కూడా ఉంది అతని వాలకం చూస్తుంటే.

'ఇంద పట్టుకో, నీ కోసమే కొన్నాను'

విసురుగా ఆ పుస్తకాన్ని అతని చేతిలోంచి లాక్కుంది జాబిల్లి. అంతే విసరుగా రోడ్డుమీదికి విసిరి కొట్టింది.

మోటర్ బైక్ కొంతదూరం ముందుకివెళ్లి సడన్‌గా ఆగిపోయింది.

నిరంజన్‌కి కోపం వచ్చిందని తెలుస్తూనే ఉంది. అతని మొహంకేసి చూడనైనా చూడకుండా బండి దిగి నించుంది జాబిల్లి.

'వెళ్ళి నువ్వు గిరాటేసిన ఆ పుస్తకాన్ని తీసుకురా' సీరియస్‌గా అన్నాడు నిరంజన్.

జాబిల్లి తల అడ్డంగా ఊపింది.

'తీసుకురానంటే రాను. వెధవ పుస్తకం దాని మూలంగానే కదా నువ్వు లేటుగా వచ్చింది అదంటే నాకు అసహ్యం' చెప్పింది.

నిరంజన్ ఆమెకేసి నిశితంగా చూశాడో క్షణం. కోపంతో బిగుసుకు పోయిన అతని దవడలు క్షణంలో మామూలు స్థితికి చేరుకున్నాయి. బైక్ మీదనుంచి కిందికి దిగాడతను.

స్టాండ్ వేసి వెనక్కి కొన్ని గజాల దూరంలో రోడ్డుమీద చెదిరిపోయి పడిఉన్న పుస్తకందగ్గరకి నడిచేడు. ఒంగి దాన్ని అందుకుని కవర్‌కి అంటిన దుమ్ము దులిపి జాగ్రత్తగా తీసుకొచ్చి తిరిగి పెట్రోల్ టాంక్‌కి తగిలించి ఉన్న చిన్న నారసంచీలో పెట్టేశాడు.

'ఈ పుస్తకంవిలువ నీకు తెలియకపోవచ్చు కానీ నాదు తెలుసు. ఎందుకలా పారేశావ్?'

'ఒకసారి నేను చూడను అని చెప్పేను నువ్వు విన్లేదు. నాకు కోపం వస్తే అంతే' తప్పంతా నీదే అన్నట్టు అంది జాబిల్లి.

'నీ సంగతి తెలిసీ దాన్ని నీచేత చదివించాలను కోవడం నాదే పొరపాటు. ఎక్కు'

బైక్‌ని స్టార్ట్ చేశాడు నిరంజన్.

జాబిల్లి ఎక్కి కూర్చుంది. అతని నడుంని గట్టిగా వాటేసుకుని.

టాంక్ బండ్ మీదుగా వెళుతోంది మోటర్ బైక్. ఓ సిమెంటు బెంచీ దగ్గర ఆపి

'ఇక్కడ కూర్చుందామా?' అడిగాడు నిరంజన్.

'ఒద్దు, పక్కనే రెయిలింగ్‌కి ఆనుకుని ఎవరో కుర్రాళ్ళున్నారు' బైక్ దిగకుండా సమాధానం చెప్పింది జాబిల్లి.

మరికొంత దూరం ముందుకెళ్ళి ఓ చోట ఆపేడు నిరంజన్.

'ఇక్కడా వద్దు బటానీ లమ్మేవాళ్ళు మల్లెపూలు అమ్మేవాళ్ళూ మాటిమాటికీ డిస్టబ్ చేస్తుంటారు' అంది.

'బటానీలు తినొచ్చు మల్లెపూలు తల్లో పెట్టుకోవచ్చు డిస్ట్రబ్ చెయ్యడానికి పబ్లిక్ ప్లేసులో మనమేమీ చెయ్యకూడని పనిచెయ్యం కదా' అందామనుకొని జాబిల్లి మొహంచూసి ఊరుకున్నాడు నిరంజన్.

కాస్త ముందుకెళ్ళి పార్కు దగ్గరగా ఆపేడు.

'ఇక్కడ మరీ రష్‌గా రోడ్డుమధ్య కూర్చున్నట్టు ఉంటుంది. ఎక్కడైనా ప్రశాంతంగా ఉండే చోట కూర్చుందాం' అంది జాబిల్లి.

విసుగు కనబడనీయకుండా నిట్టూర్చేడు నిరంజన్.

'ప్రశాంతత నీ మనసులోనే లేదు' అనుకున్నాడు మనసులో. తప్పనిసరిగా బైక్‌ని స్టార్ట్ చేసి పోనిచ్చేడు. బండి టాంక్ బండ్‌ని దాటేసి ముందుకి పోవడం చూసి

'ఇటెక్కడికి?' అడిగింది జాబిల్లి.

నిరంజన్ సమాధానం చెప్పకుండా బండి నడపసాగేడు.

'నిన్నే అడిగేది' రెట్టించింది జాబిల్లి.

'టాంక్‌బండ్ పొడుగునా కూర్చోడానికి నీకు నచ్చిన ప్రదేశం దొరకలేదుగా ఇందిరాపార్కుకి వెళదాం' చెప్పాడు.

'ఒద్దు, అక్కడికైతే నేను రాను' మొండిగా అంది జాబిల్లి.

బైక్‌ని ఆపలేదు నిరంజన్. ముందుకి పోతూనే ఉంది.

నిరంజన్ వీపుమీద గట్టిగా గిల్లింది జాబిల్లి.

రుచికరమైన 19
రకాలలో లభ్యం
కాగలవు.




ఇంట్లో తయారు చేసినట్లు రుచి. తయారుచేసుకునే శ్రమే లేదు.

'నీకే చెప్పేది. నాకు కోపం వస్తే మనిషిని కాను'

'ఆ సంగతి నాకు బాగా తెలుసు' అన్నాడు నిరంజన్.

'తెలిసే ఇటే తీసుకువెళుతున్నావంటే అసలు ఏమిటి నీ ఉద్దేశ్యం? అరిచి అరిచి తనే ఊరుకుంటుందిలే అనేనా? నీకు తెలుసో లేదో నేనలా ఊరుకునేదాన్ని ఎంతమాత్రం కాదు' అరిచి చెప్పింది జాబిల్లి.

'మహాతల్లీ నీతో నేనిక వేగలేను. నేనేకాదు మూతిమీద మీసమున్న ఏమగాడు నిన్ను సహించి భరించలేడు. ఇప్పటికే ఆలస్యం చేశాను' మనసులో అనుకున్నాడు నిరంజన్.

జాబిల్లికి తిరిగి మాట్లాడే అవకాశం లేకుండా బైక్‌ని లోయర్ టాంక్‌బండ్ మీదుగా తిరిగి టాంక్ బండ్ రోడ్డుమీదికి పోనిచ్చాడు. ఎడం పక్కగా ఉన్న వెంకటేశ్వర దేవాలయం ముందు ఆపేడు.

'దిగు' అన్నాడు జాబిల్లితో.

మనుషులెక్కువగా లేకుండా ట్యాంక్ బండ్ వ్యూ కనపడాలంటే అదే తగిన చోటు.

జాబిల్లి బైక్ దిగింది.

బండిని పార్క్ చేసి మెట్లు దిగసాగేడు నిరంజన్.

జాబిల్లికీ ఆ ప్రదేశం నచ్చింది కాబోలు మాట్లాడకుండా అతన్ని అనుసరించింది.

దేవుడి దర్శనం చేసుకుని ఓ చోట కూర్చున్నారిద్దరూ. రెండు చేతులూ జోడించి కళ్ళు మూసుకుని ఓ అరనిముషంపాటు దేవుడి ఎదురుగా నించున్న జాబిల్లిలో అంత వినకడా, ధ్యానం ఒక్కసారిగా ఎలా వచ్చాయో అర్థం కాలేదు నిరంజన్‌కి.

'ఏం కోరుకున్నావ్ దేవుడిని?' అడిగాడు

'త్వరగా మన పెళ్ళి చేసెయ్యమని' వెంటనే నిజం చెప్పేసిందామె.

'అది జరగని పని' మనసులో అనుకున్నాడు నిరంజన్.

'ఏమిటి ఆలోచిస్తున్నావ్?' అడిగింది జాబిల్లి

'నీతో ఇందాక అబద్ధం చెప్పాను. బుక్ షాపులో ఆలస్యం కాలేదు'

'మరి?' ఆశ్చర్యాన్ని కోపాన్నీ కలిపి అడిగింది.

'ఇదుగో ఇదిరాస్తూ ఇరానీ కేఫ్‌లో కూర్చు న్నాను అందుకే లేటయింది'

'ఏమిటది? కొంపదీసి కథలు గానీ రాస్తు న్నావా?'

'చదువు నీకే తెలుస్తుంది' అంటూ ఓ మడిచి ఉన్న కాగితాన్ని ఆమె ఒళ్లో పడేశాడతను.

ఆమె కళ్లువాల్చి ఆ కాగితంకేసి చూసింది. దాన్ని ముట్టుకునే ప్రయత్నం ఏమీ చెయ్యకుండానే

'ఏముంది ఇందులో?' అంది

'చదవమంటున్నాగా' విసుగ్గా అన్నాడు నిరంజన్.

'సరే ఇంటికెళ్లి తీరిగ్గా చదువుతాను' ఆమె దాన్ని అలాగే హాండ్‌బాగ్‌లో పెట్టుకోబోయింది.

అతను ఆమె చర్యల్ని గమనిస్తున్నాడు. ఆమె ఎంత బద్ధకస్తురాలో అంతకుమించిన మొండిదని మరోసారి అర్థం అయింది.

'దాన్నిటివ్వు' అన్నాడు

ఆమె తలెత్తి అనుమానంగా చూసింది.

'నువ్వు కావాలంటే అలాగే ఇచ్చేస్తాను. కానీ ముందు అందులో ఏముందో చెప్పితీరాలి' అంది.

అతను అసహనంగా చూశాడు

'ఇదే.. నీతో వచ్చిన చిక్కు. నీఅంత ముక్కోపి, జగమొండి ఈ ప్రపంచంలో ఎవ్వరూ ఉండరు. నిన్ను భరించడం చాలా కష్టం. ఆ విషయమే రాశానందులో' అన్నాడు.

'నేను ఇదివరకే చెప్పాను,. నా తత్వమే అంత' మొండిగా అంది

'నాతత్వం అంతే నేనలాగే పుట్టాను అన్నది సంమాధానం కాదు. నువ్వు మారాలి జాబిల్లీ ఎంతో మారాలి'

'అది నావల్లకాదు. ఇపుడు నేను కొత్తగా మారాల్సిందేమీ లేదు' మూతి బిగించేసి వాదనకి దిగింది జాబిల్లి.

'ఎందుకో నేను చెప్పనా, నువ్వు అందరితోనూ అన్ని విషయాల్లోనూ కరుగ్గా పెడసరంగా ఉండటానికి కారణం నీకు చాలా విషయాలు తెలీవు. అర్థంకావు. అందుకే నీ తెలీనితనాన్ని కోపం ద్వారా ప్రదర్శిస్తావు'.

'ఎవరన్నారా మాట?'

'నేనే అంటున్నాను నిన్ను ఈ కొద్దికాలంలోనూ నేను అర్థం చేసుకున్నంతగా ఎవరూ ఆఖరికి మీ డాడీ కూడా అర్థం చేసుకుని ఉండడు'.

జాబిల్లి విసుగ్గా చూసింది. విరాగ్గా మొహాన్ని చిట్లించింది. అసహనంగా కదిలింది. ఓసారి బద్ధకంగా ఒళ్లు విరుచుకుని ఆవులించింది.

'సుత్తి చాలుగానీ పదపోదాం. ఆకలేస్తోంది. మధ్యాహ్నం కూడా ఏమీ తిన్లేదు. ముందు ఏదైనా హోటల్‌కెళ్లి కడుపునిండా టిఫిన్ లాగించెయ్యాలి' అంటూ లేచింది.

నిరంజన్ కూర్చున్న చోటునుంచి లేవలేదు. తలెత్తి ఆమెకేసి నిశితంగా పరీక్షగా చూసాడు.

గుండ్రని మొహం, తిన్నని ముక్కు, చిన్న గెడ్డం, విశాలమైన నల్లని కళ్లూ నుదుటిన చందమామ గుండ్రని బొట్టు, పలుచని పెదవులు, చిన్నినోరు వదులుగా అల్లిన జడ, గాలికి ఎగురుతున్న గార్డెన్‌సిల్క్ చీరలో వయసొచ్చిన పసిపిల్లగా కనబడింది జాబిల్లి నిరంజన్ కంటికి.

జాబిల్లిని చూస్తుంటే అప్పటికప్పుడు ఓ విషయం స్ఫురించిందతనికి.

'నా లెటర్ నాకిచ్చెయ్' అన్నాడు'

'అందులో ఏం రాశావో చెబితేనే' అంది జాబిల్లి.

"ఏంలేదు నీకు లవ్ లెటర్ రాయాలనిపించింది, నేను నిన్ను ప్రేమిస్తున్నానని రాశావంతే' అన్నాడు నిరంజన్.

'ఆ మాట చెప్పడానికి నీకు నోరుందికదా ఇంత మాత్రందానికి టైం వేస్టుచేసుకుని లెటర్ రాయడమెందుకు, ఇంద తీసుకో' అంటూ అందించింది జాబిల్లి.

దాన్ని అందుకుని చదివేడు నిరంజన్.

'జాబిల్లీ నువ్వు ఆశపడుతున్నట్లుగా మన పెళ్లిజరగదు. నీకున్న మనస్తత్వంతో నిన్ను జీవితాంతం భరించగల ఓపిక నాకులేదు. ఇదే మన ఆఖరి కలయిక. ఈ విషయం నీ మొహాన చెప్పి నీకొచ్చే కోపాన్ని ఎదుర్కొనే శక్తి లేక ఈ ఉత్తరం రాస్తున్నాను. నన్ను మర్చిపో— నిరంజన్'

ఉత్తరాన్ని ముక్కలు ముక్కలుగా చింపి దూరంగా విసిరేసాడు నిరంజన్. గాలిలో పైపైకి ఎగురుతున్న కాగితంముక్కలకేసి చూస్తూ అనుకున్నాడు మనసులో.

'ఈ పిల్లలో ఎంత తొందరపాటు ఉందో అంత అమాయకత్వం కూడా ఉంది. ఎంత కోపముందో అంతటి మెతకదనం కూడా ఉంది. తనకి కావల్సింది తప్ప మరో విషయం పట్టించుకోదు. మస్తుగా మందుకొట్టి గర్ల్ ఫ్రెండ్‌తో రేసెస్ కెళ్లే తనవీ, సంపాదన మించి ఖర్చుచేసే తన జల్సాజీవితాన్ని ఈ పిల్ల తప్ప ఎవరూ భరించలేరు. ఆమె కోపాన్ని మాత్రం తను భరించగలిగితే చాలు'

అందుకే నవ్వుతూ లేచి జాబిల్లికి చెయ్యి అందించాడు.

'ఆమాట నోటితో చెబితే నువ్వు కరుస్తావు కదా అందుకని చెప్పలేదు. అంతేకాదు మరో సంగతి కూడా అందులో రాశాను...'

'ఏమిటది?' అడిగింది జాబిల్లి

'మీ డాడికీ చెప్పి వచ్చేనెలలో మన పెళ్లికి ముహూర్తం పెట్టించమని'

జాబిల్లి నిండుగా నవ్వింది! ©

